# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రతి నెల ఒకటో తేదీన 'పేదల సేవలో' కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ఉద్దానం ప్రాంతంలో ఉన్న కొబ్బరి పంటకు పూర్వ వైభవం తీసుకువస్తామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.
- కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టిందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు.
- రాష్ట్రంలో రెండు ప్రధాన బౌద్ధ సర్క్యూట్లను అభివృద్ధి చేయనున్నామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.
- బంగాళాతంలో ఈనెల 23వ తేదీన అల్పపీడనం ఏర్పడనుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==========================

పేద ప్రజల కోసం ప్రతి నెల ఒకటో తేదీన 'పేదల సేవలో' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. "ఇది మంచి ప్రభుత్వం" పేరిట రాష్ట్ర ప్రభుత్వం చెపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈరోజు ప్రకాశం జిల్లా మద్దిరాలపాడు గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు, అమలు చేశామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఏప్రిల్ నుంచి పింఛన్ అందిస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు, అధికారులు పేదల ఇళ్లకు వెళ్లి వారి కష్టాలు తెలుసుకుని సహాయం అందించాలని ముఖ్యమంత్రి వివరిస్తూ....

(వాయిస్ 28 సెకన్లు)

============================

శ్రీకాకుళం జిల్లాలో ఉన్న ప్రధాన నదులను త్వరలో యుద్ధప్రాతపదికన అనుసంధానం చేస్తామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. జిల్లాలోని కవిటి మండలం రాజపురం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న “ఇది మంచి ప్రభుత్వం” కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడుతో కలసి కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... ఉద్దానం ప్రాంతంలో ఉన్న కొబ్బరి పంటకు పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం కొబ్బరి పార్కు ఏర్పాటుకు చర్యలు చేపట్టినదన్నారు. అలాగే మంత్రి కింజరాపు అచ్చం నాయుడు మాట్లాడుతూ.. నిరుపేదల ఆకలి తీర్చే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని.. వంద రోజుల పాలనలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేశామని తెలియజేశారు.

============================

శ్రీవారి లడ్డూ తయారీకి నాణ్యతలేని నెయ్యిని వాడినట్లు నిర్ధారణ అయిందని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు తెలిపారు. ఈరోజు తిరుమలలోని అన్నమయ్య భవనంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ, తిరుమలను పవిత్రం స్థలంగా భావిస్తారని అన్నారు. అటువంటి శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పరిశీలించామని.. అయితే లడ్డు ప్రసాదంలో వాడే నెయ్యిలో నాణ్యత లేదని తేలిందన్నారు. టీటీడీలో నెయ్యిని క్షుణ్ణంగా పరిశీలించే అడల్ట్రేషన్ ల్యాబ్ వంటి సొంత ప్రయోగశాలలు లేకపోవడంతో నాణ్యతలేని నెయ్యిని సరఫరా చేసారని తెలిపారు. లడ్డుపై ముఖ్యమంత్రికి ఈరోజు సాయంత్రంలోగా నివేదికను అందిస్తానని ఈవో వెల్లడించారు.

============================

రాష్ట్ర పర్యాటక అభివృద్ధికి సహకరించాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ విదేశీ పర్యాటక ప్రతినిధులను కోరారు. విజయవాడలోని జరిగిన “ఆంధ్రప్రదేశ్-వియత్నాం టూరిజం కాన్‌క్లేవ్-2024” ముగింపు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటక రంగ అవకాశాలను వివరించిన మంత్రి.. రెండు ప్రధాన బౌద్ధ సర్క్యూట్లను అభివృద్ధి చేయాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ - వియత్నాం మధ్య పర్యాటక, కల్చరల్ ఎక్స్‌చేంజ్‌కు మరింత బలం చేకూర్చే లక్ష్యంతో అనేక కార్యక్రమాలు ఈ కాన్‌క్లేవ్ లో చేపట్టారు. ఈ కాన్‌క్లేవ్ కు 200 మందికి పైగా పర్యాటక ప్రతినిధులు హాజరయ్యారు. దేశంలోనూ, ఆంధ్రప్రదేశ్ లో పర్యాటక అవకాశాలు, అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నామని ప్రతినిధులు తెలిపారు.

============================

ఉత్తర మధ్య బంగాళాతంలో ఈనెల 23వ తేదీన అల్పపీడనం ఏర్పడనుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో పలు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అయితే బంగాళాఖాతంలో ఆగ్నేయంగా వాయుగుండం కొనసాగుతోందని, ఈ క్రమంలో రాష్ట్రంలో రానున్న మూడు రోజులు బలమైన గాలులు వీస్తాయని తెలిపింది. దీంతో ఈ నెల 23, 24వ తేదీ వరకు కోస్తా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అనకాపల్లి, కోనసీమ, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, కాకినాడ, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

విరామం

============================

కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టిందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఈరోజు

జరిగిన కూటమి 100 రోజుల పాలన సభలో కేంద్ర సహాయ మంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... 3 వేల రూపాయల ఉన్న పెన్షన్ ను 4 వేలకు పెంచి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. రాష్ట్రంలో ఒకే రోజు 13 వేల 300 గ్రామ సభలు పెట్టి ఆ గ్రామ సభల ద్వారా 4 వేల 500 కోట్లు విలువైన ఉపాధి హామీ పథకాలకు తీర్మానం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొంటూ....

(వాయిస్ 30 సెకన్లు)

============================

యువగళం పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. చిత్తూరు జిల్లాలోని బంగారుపాళ్యంలో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగుల ఆరోగ్య స్థితిగతులని అడిగి తెలుసుకున్నారు. అలాగే నూతనంగా నిర్మించిన ఔట్ పేషెంట్ విభాగం, ఆస్పత్రిని ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం 'ప్రజా దర్బార్' నిర్వహించిన మంత్రి.. చిత్తూరు జిల్లాను సమగ్రంగా అభివృద్ధి పరుస్తామన్నారు.

============================

విజయనగరం ప్రజల ఇలవేల్పు శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరాలకు అంకురార్పణ జరిగింది. నెల రోజుల ఉత్సవాల్లో భాగంగా ఈరోజు విజయనగరం పట్టణంలోని అమ్మవారి చదురుగుడి, వనంగుడిల వద్ద పందిరిరాట కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా వేద పండితుల మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ చేపట్టారు. శాసనసభ్యురాలు అదితీ గజపతిరాజు, మేయర్ విజయలక్ష్మి, ఆలయ ప్రధాన పూజారి బంటుపల్లి వెంకటరావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పలువురు భక్తులు అమ్మవారి మండల దీక్షలను స్వీకరించారు. ఈరోజు మొదలు అక్టోబరు 30న వనంగుడి వద్ద నిర్వహించే చండీహోమం, పూర్ణాహుతి, దీక్ష విరమణతో ఉత్సవాలు ముగియనున్నాయి. జాతరలో కీలక ఘట్టాలైన అమ్మవారి తొలేళ్ల సంబరం, సిరిమానోత్సవం అక్టోబరు 14, 15వ తేదీల్లో జరగనున్నాయి.

============================

వేద విద్యను అభ్యసించిన నిరుద్యోగ వేద పండితులకు నిరుద్యోగ భృతి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమీషనర్ కె.ఎల్. సుధారాణి తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 26వ తేదీ లోగా సమర్పించాలని ఆమె తెలిపారు. రాష్ట్రంలో వేద విద్యను అభ్యసించిన నిరుద్యోగులకు నెలకు 3 వేలు రూపాయల నిరుద్యోగ భృతి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఈ మేరకు నిరుద్యోగ వేద పండితుల నుండి దేవదాయ ధర్మదాయ శాఖ దరఖాస్తులు స్వీకరిస్తుందని తెలిపింది. పార్వతీపురం మన్యం జిల్లాలో వేద విద్యను అభ్యసించి నిరుద్యోగులగా ఉన్న అభ్యర్థులు భృతిని పొందేందుకు వేదాధ్యయన సర్టిఫికెట్ల నకళ్లు, ఆధార్ నకలు, ఏ విధమైన ఉద్యగం చేయటం లేదని తెలియజేస్తూ స్వీయ ధ్రువ పత్రంతో దరఖాస్తులను జిల్లా దేవదాయ శాఖ అధికారికి సమర్పించాలని ఆమె తెలిపారు.

============================

పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాముఖ్యతనిస్తానని అనకాపల్లి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎం.దీపిక అన్నారు. పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి “పోలీస్ గ్రీవెన్స్ డే” నిర్వహించి, సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సిబ్బంది వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

============================
============================